సాక్షి నల్లగొండ

సోమవారం, 6, అక్టోబర్, 2025



క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని భారత క్రికెట్ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ అన్నారు. - 8లో



భక్తుల కిటకిట

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆదివారం 40వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	587.50 అడుగులు
ఇన్‌ఫ్లో	:	55,131 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	55,131 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,495 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	10,040 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	8,896 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌డే రద్దు

నల్లగొండ: స్థానిక సంస్థలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ప్రతి సోమవారం జరిగే పోలీస్ గ్రీవెన్స్ డే రద్దు చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తామని.. అప్పటి వరకు జిల్లా పోలీస్ కార్యాలయానికి బాధితులు రావద్దని పేర్కొన్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



లాంచీ దిగివస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. దసరా పండుగకు స్వగ్రామాలకు వెళ్లిన వారంతా ఆంధ్రా ప్రాంతం నుంచి హైద్రాబాద్, తదితర పట్టణాలకు వెళ్తూ మార్గమధ్యంలో ఉన్న సాగర్ అందాలను తిలకించారు. సాగర్ డ్యాం దిగువన నదీతీరం వెంట, లాంచీ స్టేషన్, బుద్ధవనం, కొత్తబ్రిడ్జి, అనుపు, ఎత్తిపోతల తదితర ప్రాంతాల్లో సందడి చేశారు. వాహనాలు ఎక్కువగా నిలపడంతో కొత్తబ్రిడ్జి వద్ద ట్రాఫిక్ స్తంభించింది.

మూసీకి 2,248 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



మూసీ గేటు నుంచి దిగువకు పోతున్న నీరు

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద తగ్గింది. మూసీ రిజర్వాయర్‌కు పదిహేను రోజుల నుంచి ఐదువేల క్యూసెక్కులకు పైగా వచ్చిన ఇన్‌ఫ్లో ఆదివారం 2,248 క్యూసెక్కులకు తగ్గిపోయింది. దీంతో ప్రాజెక్టు ఒక క్రస్ట్ గేటును రెండు అడుగుల మేర పైకెత్తిన అధికారులు 1,949 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి వదులుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 603 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సీపేజీ, లీకేజీ, ఆవిరి రూపంలో 50 క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది. మూసీ ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు)కాగా ఆదివారం సాయంత్రం వరకు 643.80 అడుగుల(4.15 టీఎంసీలు)వద్ద నీరుంది.

నూతన కార్యవర్గం ఎన్నిక

రామగిరి(నల్లగొండ): ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ పోస్ట్‌మెన్, ఎంటీఎస్ 42 వార్షిక మహాసభ ఆదివారం నల్లగొండ పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్ల యాదయ్య కార్యదర్శిగా కే కృష్ణయ్య ఎన్నికయ్యారు. ఫైనాన్సియల్ సెక్రెటరీగా సత్యనారాయణ ఎన్నికయ్యారు. వీరితో పాటు 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఏఐపీఈయూ పోస్ట్‌మెన్, ఎంటీఎస్ కార్యదర్శి ఏం. మధుసూదన్‌రావు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాట్యమయూరాలు

భువనగిరి: రాయగిరి మినీ శిల్పారామంలో సెప్టెంబర్ 29 నుంచి జరుగుతున్న దసరా ఉత్సవాలు అదివారం ముగిశాయి. చివరి రోజు హైదరాబాద్‌కు చెందిన తుమ్మాటి ప్రణవి శిష్యబృందం కళాకారులు కూచిపూడి నృత్యంలో అలరించారు. సెలవు దినం కావడంతో యాదగిరిశేడి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో మినీశిల్పారామాన్ని సందర్శించారు. సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. చెరువులో బోటు షికారు చేసి, పార్కులో ఆహ్లాదంగా గడిపారు. కార్యక్రమంలో కళాకారిణులు అంజని, కీర్తన, సహస్ర, ప్రదీక్ష, రితిక, సాన్వి, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణం తిప్పలు



దసరా సెలవులు పూర్తయి జనం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కావడంతో 65వ నంబర్ జాతీయ రహదారిపై కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద బారులు దీరిన వాహనాలు



నల్లగొండ బస్టాండ్‌లో హైదరాబాద్ టికెట్ కౌంటర్ వద్ద బారులుదీరిన ప్రయాణికులు

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాతం, ఆరాధన సేవలు నిర్వహించారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం చేసి, తులసీదళ అర్చనతో కొలిచారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం , బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర, సువర్ణ పుష్పార్చన పూజలు గావించారు. సాయంత్రం వెండి జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ద్వారబంధనం చేశారు.

రైతులకు ఊరట

- జీఎస్‌టీ తగ్గింపుతో దిగివస్తున్న వ్యవసాయ పరికరాల రేట్లు
- యాంత్రీకరణ పథకానికి రేట్లు సవరిస్తున్న అధికారులు
- 15వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం
- ఈ నెలాఖరు నాటికి రైతులకు అందనున్న పరికరాలు



నల్లగొండ అగ్రికల్చర్ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ పరికరాలపై జీఎస్‌టీ తగ్గించడంతో రైతులకు ఊరట లభించింది. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలపై గతంలో 18 శాతం జీఎస్‌టీ ఉండేది. దీంతో రైతులపై పెద్ద ఎత్తున భారం పడేది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించడంతో వ్యవసాయ పరికరాల ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ధరలు తగ్గడం రైతులకు కాస్త మేలు జరగనుంది.

ఇప్పటి వరకు 1400 దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించిన విషయం తెలిసిందే. ఈ పథకానికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు కూడా విడుదల చేసింది. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరిస్తూ ఈ పథకాన్ని అమలు చేయనుంది. గత యాసంగిలోనే పథకాన్ని ప్రారంభించినప్పటికీ మార్చిలో బడ్జెట్ ముగింపు సందర్భంగా ఏర్పడిన సాంకేతిక కారణాల వల్ల నిధులు రాలేదు. ఈసారి ముందస్తుగానే ఈ పథకానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇప్పటికే జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల నుంచి పరికరాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1400 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకోనున్నారు. అక్టోబరు చివరి నాటికి లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేసి పరికరాలను అందించనున్నారు.

సబ్సిడీపై పరికరాల అందజేత

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ తగ్గించడంతో.. ప్రభుత్వానికి వ్యవయాయ యాంత్రీకరణ పరికరాలు సరఫరా చేసే కంపెనీలు కూడా రేట్లలో మార్పులు చేస్తున్నాయి. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీపై పరికరాలను అందజేయనున్నారు. యాంత్రీకరణ దరఖాస్తులను స్వీకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు.. యూనిట్ల రేట్లను సవరిస్తున్నారు. దీంతో ఈ పథకంలో రైతులపై కూడా ఆర్థికభారం తగ్గనుంది.

15 రకాల పరికరాలు..

వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో 15 రకాల పరికరాలు ఉన్నాయి. వాటిలో రోటోవేటర్, ఎండీ ప్లగ్, కల్టివేటర్, డిస్కియారో, కేజీవీల్, పండ్ పర్మార్, రోడో పడ్లర్, పవర్ టిల్లర్, సీడ్ ఫ్రం పర్టిలైజర్ డ్రిల్, మాన్యువల్ స్ప్రేయర్, బ్యాటరీ ఆపరేటెడ్ స్ప్రే, పవర్ వీడర్, బ్రష్‌కటర్, స్ట్రాబేలర్స్ తదితర పరికరాలను రైతులకు సబ్సిడీపై అందించనున్నారు. జీఎస్‌టీ సవరించడంతో వీటి ధరలు కూడా తగ్గనున్నాయి.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి



యాంత్రీకరణ పరికరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసి అక్టోబర్ చివరి నాటికి పరికరాలను అందజేస్తాం. కేంద్రం వ్యవసాయ పరికరాలపై జీఎస్‌టీ తగ్గించిన కారణంగా ధరలు తగ్గుతాయి.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, నల్లగొండ

గుర్తింపు పొందిన పార్టీలు 12

- స్థానిక సంస్థల ఎలక్షన్లకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి గుర్తింపు
- ఆయా పార్టీలకు ఓటర్ల జాబితా అందించేందుకు ఏర్పాట్లు



నల్లగొండ : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి 12 రాజకీయ పార్టీలకు మాత్రమే గుర్తింపు దక్కింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులుగా బరిలో నిలిచే ఆయా అభ్యర్థులకు పార్టీలు బీ ఫారాలు అందజేస్తాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన పార్టీలకు స్థానిక ఓటర్ల జాబితా ముద్రించి అందించేందుకు జిల్లా పరిషత్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నేటి నుంచి పార్టీల జిల్లా అధ్యక్షులకు ఒక సెట్ జాబితాను ఇవ్వనున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, బీఎస్పీ, తెలుగుదేశం, సమాజ్‌వాదీ పార్టీ, ఆమ్‌ఆద్మీ, జనసేన, ఎంఐఎంలకు మాత్రమే ఎన్నికల సంఘం నుంచి గుర్తింపు వచ్చింది. ఆయా పార్టీలు తమ అభ్యర్థులకు బీ ఫారాలు అందిస్తే వారికి పార్టీల గుర్తులు దక్కనున్నాయి. స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచే వారికి ఇతర గుర్తులు కేటాయించనున్నారు.

ఎంపీటీసీ స్థానాలు :	353
జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు :	33
పోలింగ్ కేంద్రాలు :	1,957
మొత్తం ఓట్లు :	10,73,506

ముమ్మరంగా ఎన్నికల ప్రక్రియ

జిల్లాలో 353 ఎంపీటీసీ, 33 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా.. 1,957 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనుంది. జిల్లాలో 10,73,506 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వారిలో 5,30,860 మంది పురుషులు, 5,42,589 మంది మహిళలు, 57 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఎన్నికల పనులు ఊపందుకున్నాయి. సంబంధిత అధికారులు ఎన్నికల ప్రక్రియను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, వారి విగ్రహాలకు ముసుగులు వేశారు. కాగా.. రిజర్వేషన్ల అంశంపై ఈ నెల 8న హైకోర్టు వెల్లడించే తీర్పు కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎదురుచూస్తున్నారు.

కృష్ణారెడ్డి ఆత్మీయ అభినందన సభ



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న రచయితలు, కవులు

రామగిరి (నల్లగొండ): మానవీయ స్పృహతో కూడిన కవిత్వం రాయడం బైరెడ్డి కృష్ణారెడ్డికే సాధ్యమని సాహితీవేత్త కె.కనకాచారి అన్నారు. ఆదివారం నల్లగొండలోని ఎస్పీఆర్ పాఠశాలలో నిర్వహించిన కృష్ణారెడ్డి ఆత్మీయ అభినందన సభలో ఆయన మాట్లాడారు. కవిత్వంలో కృష్ణారెడ్డికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వారు కీర్తి పురస్కారం ప్రకటించిన సందర్భంగా ఈ ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశామన్నారు. నాలుగు దశాబ్దాలుగా ఆర్తి పేరుతో కవిత్వ సంపుటలు వెలువరిస్తూ కృష్ణారెడ్డి తనదైన ముద్ర వేశారన్నారు. అనంతరం కృష్ణారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మేరెడ్డి యాదగిరిరెడ్డి, పెరుమాళ్ళ ఆనంద్, మునాసు వెంకట్, తండు కృష్ణకౌండిన్య, కోమటి మధుసూదన్, మాదగాని శంకరయ్య, డాక్టర్ పగడాల నాగేందర్, ఎలికట్టె శంకర్‌రావు, హిమవంతరెడ్డి, బండారు శంకర్, సాగర్ల సత్తయ్య, భీమార్జున్‌రెడ్డి, దాసరి శ్రీరాములు, డాక్టర్ మేక ఉమారెడ్డి, గంటికంపు గణేష్, డా.ద్రైద రవి, సంధ్య, అంబటి వెంకన్న, దేవులపల్లి రామచంద్రయ్య, డాక్టర్ చింతోజు మల్లికార్జునచారి, బైరెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బీమా ఉద్యోగుల పోరాట ఫలితమే జీఎస్టీ రద్దు



సమావేశంలో మాట్లాడుతున్న రఘు

నల్లగొండ టౌన్: బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అఖిల భారత బీమా ఉద్యోగులు సంఘం పోరాట ఫలితమే అని సికింద్రాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి డీ.ఎస్.రఘు అన్నారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన ఐసీఈయూ నల్లగొండ 1,2, ఎల్ఐసీ శాఖల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీలు, ఎమ్మెల్యేలను కలిసి బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు ఎన్నో ఆందోళనలు చేశామన్నారు. ఎల్ఐసీలో ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఐసీఈయూ డివిజన్ కోశాధికారి జావీద్, జిల్లా సంయుక్త కార్యదర్శి పెరుమాళ్ళ బాలస్వామి, గద్దం నవీన్‌దాస్, బి.రాములుయాదవ్, బెల్లంకొండ కన్నయ్య, వెంకన్న, పోలె లింగయ్య, వేముల కృష్ణయ్య, వేముల శ్రీను, గౌరు శ్రీనివాస్, ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, శ్యాంబాబు, నరేందర్‌రెడ్డి, రావుల వీరయ్య, నలపరాజు సైదులు, దారం వెంకన్న, బి.రామలింగం పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఆన్‌లైన్ విధానం

- పన్ను చెల్లించిన వాహనాలకే ప్రవేశం
- అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశించే వాహనాలపై కేసులు
- నూతన విధానంపై వాహనదారులకు అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీల ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల చెక్‌పోస్టులు



వాడపల్లి చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మిర్యాలగూడ : అంతర్ రాష్ట్ర సరిహద్దుల వద్ద రవాణా శాఖ ఆధ్వర్యంలో ఉన్న చెక్‌పోస్టులను తొలగించి ఆన్‌లైన్ విధానంలో పన్ను వసూలు చేయనున్నారు. ఆఫ్‌లైన్ విధానంలో పన్నుల వసూలులో జరిగే అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న రవాణాశాఖ చెక్‌పోస్టులను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆయా చెక్‌పోస్టుల వద్ద ఆన్‌లైన్ విధానంలో పన్ను వసూలుకు సంబంధించిన ఏర్పాట్లు చేసేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో రవాణా శాఖ అధికారులు తాత్కాలికంగా చెక్‌పోస్టులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయా చెక్‌పోస్టుల వద్ద ఆన్‌లైన్ విధానానికి సంబంధించిన ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ విధానం అమలైతే వాహనదారులు తాత్కాలిక, పర్మినెంట్ ట్యాక్స్‌లను ఆన్‌లైన్‌లో చెల్లించి రాష్ట్రంలోకి ప్రవేశించాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2015లో రాష్ట్ర వ్యాప్తంగా 15 చెక్‌పోస్టులు ఏర్పాటు కాగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వాడపల్లి, నాగార్జునసాగర్, కోదాడ సమీపంలోని నల్లబండగూడెం వద్ద తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగించే తదితర వాహనాల నుంచి పన్ను వసూలు చేస్తున్నారు. ఈ చెక్‌పోస్టుల ద్వారా ప్రతి నెలా సుమారు రూ.2 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది.

ప్రస్తుతం తాత్కాలికంగా చెక్‌పోస్టుల నిర్వహణ

రాష్ట్ర ప్రభుత్వం అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న రవాణాశాఖ చెక్‌పోస్టులను ఎత్తివేస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆయా చెక్‌పోస్టుల వద్ద ఆన్‌లైన్ విధానంలో పన్ను వసూలుకు సంబంధించిన ఏర్పాట్లు చేసేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో రవాణా శాఖ అధికారులు తాత్కాలికంగా చెక్‌పోస్టులు నిర్వహిస్తున్నారు.

ఆన్‌లైన్ వసూళ్లపై అనుమానాలు..

చెక్‌పోస్టును తొలగిస్తుండడంతో ఆన్‌లైన్ ద్వారా వచ్చే ఆదాయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోతే ఇతర రాష్ట్రాల నుంచి వాహనదారులు పన్ను చెల్లించకుండానే రాకపోకలు సాగించే అవకాశం ఉంది. ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించడంతోపాటు అనుమతులు లేకుండా తిరిగే వాహనదారులను గుర్తించి సరైన చర్యలు తీసుకున్నప్పుడే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా పర్యవేక్షణ చేసేందుకు వాహనాలతోపాటు సిబ్బంది కూడా అవసరం ఏర్పడుతుంది. ప్రభుత్వం నిర్దేశించిన మేర స్క్వాడ్ బృందం పర్యవేక్షించాల్సి ఉంటుంది.

వాహనదారులకు అవగాహన కల్పించేలా..

ఆన్‌లైన్ పన్ను వసూలు చేయనున్న నేపథ్యంతో వాహనదారులకు అవగాహన కల్పించేలా.. చెక్‌పోస్టుల వద్ద ఇంగ్లిషు, తెలుగు, హిందీ భాషల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో టెంపరరీ పర్మిట్, వాలంటరీ ట్యాక్స్, స్పెషల్ పర్మిట్‌ను ఏవిధంగా చేసుకోవాలో ఆ ఫ్లెక్సీలో వివరించారు. ప్రతి వాహనదారుడు ఆన్‌లైన్‌లో వాహనాల వివరాలను నమోదు చేసుకొని అనుమతి పొందాలని సూచిస్తున్నారు.

నూతన విధానం ఇలా..

ఆన్‌లైన్ పన్ను వసూలుకు కోసం ప్రభుత్వం వాహన యాప్‌ను అమల్లోకి తెచ్చింది. ఈ విధానం అమలులో భాగంగా సరిహద్దు వద్ద రవాణాశాఖ ఏఎన్‌పీఆర్ (ఆటో నెంబర్ ప్లేట్ రీడర్) కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఈ – ఎన్‌ఫోర్స్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. రాష్ట్రంలోకి ప్రవేశించే వాహనాలను గుర్తించేలా దానికి వాహన యాప్‌ను అనుసంధానం చేయనున్నారు. తద్వారా ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాల వివరాల తెలుస్తాయి. ఈ విధానం పూర్తిస్థాయిలో అమలైతే వాహనదారులు నిర్దేశించిన వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్‌లో నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఎవరైనా అక్రమంగా ప్రవేశిస్తే మొబైల్ టీమ్‌లు వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తాయి.



నల్లగొండ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కరసేవకులు



సందేశం ఇస్తున్న గార్లపాటి వెంకటయ్య

హిందూ సంఘటనతోనే రక్షణ

నల్లగొండ టూటౌన్ : హిందూ సంఘటన దేశానికి రక్షణ అని హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందని ఆర్‌ఎస్‌ఎస్ నల్లగొండ విభాగ్ సంఘ చాలక్ గార్లపాటి వెంకటయ్య అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నల్లగొండ నగర శాఖ ఆధ్వర్యంలో మేకల అభినవ్ స్టేడియం నుంచి నాగార్జున కళాశాల వరకు పద సంచలన్ (ర్యాలీ) నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశ అభివృద్ధికి హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఇటికాల కృష్ణయ్య, దోసపాటి శ్రీనివాస్, కాసం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మానసిక వేదనతో యువతి ఆత్మహత్య

మిర్యాలగూడ టౌన్: మానసికంగా బాధపడుతున్న యువతి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మిర్యాలగూడ మండలం చింతపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బుద్దాతండాలో ఆదివారం జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బుద్దాతండకు చెందిన బానోతు దాసు కుమార్తె అనుజ(19) హైదరాబాద్‌లోని ఓ సెల్ పాయింట్‌లో గత నెల రోజులుగా పనిచేస్తుంది. దసరా పండుగకు వారం రోజుల క్రితం ఇంటికి వచ్చిన అనుజ మానసిక వేదనతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ సమస్యలతో..

మోత్కూరు: కుటుంబ సమస్యలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూరు మండలం తేరాల గ్రామానికి చెందిన ఇంద్రాల మల్లయ్య(45) తన భార్య రాజ్యలక్ష్మితో కలిసి గత 15 ఏళ్లుగా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా కాలనీలో నివాసముంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మల్లయ్య కుమార్తె ఐదు నెలల క్రితం మరో వ్యక్తితో వెళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మానసిక వేదనతో ఆదివారం రాత్రి ఇంట్లో రేకుల పైకప్పుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోత్కూరు ఎస్ఐ కొంపెల్లి సతీష్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

చౌటుప్పల్: ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణంలోని కంచరకుంట్ల కాలనీలో నివాసముంటున్న కొండ శ్రీనివాస్(40) మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కొత్తగా ఇంటిని నిర్మించుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసం బ్యాంకులో రుణం తీసుకోవడంతో పాటు అప్పులు చేశాడు. నెలవారి వాయిదాలు చెల్లించడం ఇబ్బందిగా మారడంతో మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దసరా పండుగకు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిన శ్రీనివాస్ భార్య వనజాత ఆదివారం ఉదయం తిరిగి చౌటుప్పల్‌కు చేరుకుంది. ఇంటి తలుపులు పెట్టి ఉండడంతో కిటికీలోంచి లోపలికి చూడగా శ్రీనివాస్ ఉరికి వేలాడుతుండటం గమనించింది. చుట్టుపక్కల వారికి విషయం చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

సూర్యదేవాలయంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి: తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని చాయా సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, ఇంద్రారెడ్డి, గిరి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, శ్రీరాంపాండే, అంకిత్‌పాండే, భక్తులు పాల్గొన్నారు.

యాదగిరీశుడి క్షేత్రంలో భక్తుల కిటకిట



ముఖ మండపం క్యూలైన్‌లో స్వామి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు



ఆలయ మాడ వీధిలో కిటకిటలాడుతున్న భక్తులు

- స్వామి వారిని దర్శించుకున్న 40వేల మందికి పైగా భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. దసరా సెలవులు సైతం ముగియడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, మాడ వీధులు, ప్రసాద విక్రయశాల, క్యూకాంప్లెక్స్ ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. స్వామి వారి ధర్మ దర్శనానికి మూడు గంటలకు పైగా సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. ఉదయం వర్షంలో సైతం స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా వచ్చారు. 40వేల మందికి పైగా భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.50,54,516 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

పచ్చని చెట్ల పందిరి



మోతె: హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్ల వెంట నాటిన మొక్కలు చెట్లుగా మారి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మోతె మండలం విభళాపురం-మామిళ్లగూడెం గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన పచ్చని చెట్లు వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి.

వాడపల్లి వద్ద ఆర్డీఆర్ అస్థికలు నిమజ్జనం



దామోదర్‌రెడ్డి అస్థికలను నిమజ్జనం చేస్తున్న ఆయన కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి

మిర్యాలగూడ: అనారోగ్యంతో మృతిచెందిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి(ఆర్డీఆర్) అంత్యక్రియలు శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. కాగా.. దామోదర్‌రెడ్డి అస్థికలను ఆదివారం ఆయన కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు దామరచర్ల మండలం వాడపల్లిలోని కృష్ణా, మూసీ నదుల సంగమం వద్ద నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి సోదరులు గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి, భాస్కర్, జెన్నారెడ్డి ప్రతాప్‌రెడ్డి, చకిల రాజేశ్వర్‌రావు, కోతి గోపాల్‌రెడ్డి, అంజద్‌అలీ, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో దామన్న వీరాభిమాని మృతి



జానపాటి చంద్రయ్య (ఫైల్)

అర్వపల్లి: కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి వీరాభిమాని, జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన జానపాటి చంద్రయ్య(63) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. దామోదర్‌రెడ్డి మరణించినప్పటి నుంచి చంద్రయ్య తీవ్రమైన బాధలో ఉన్నాడని, శనివారం తుంగతుర్తిలో దామోదర్‌రెడ్డి అంత్యక్రియలకు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చి నిద్రించిన చంద్రయ్య అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో దామోదర్‌రెడ్డి ఎక్కడికి వచ్చినా చంద్రయ్య ఆయన దగ్గరకు వెళ్లి వస్తాడని గ్రామస్తులు తెలిపారు. చంద్రయ్య భౌతికకాయానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు చంద్రయ్యకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కారును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- ముగ్గురికి గాయాలు



నుజ్జునుజ్జయిన కారు

చిట్యాల: రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల మధ్య నలిగిపోయి కారు నుజ్జునుజ్జవ్వగా.. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల పట్టణ శివారులో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. స్థానిక ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు చిట్యాల పట్టణ శివారులోని ఇండియన్ పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే హైవేపై ట్రాఫిక్ జాం కావడంతో డ్రైవర్ బస్సును రహదారి పైనే నిలిపివేశాడు. బస్సు వెనుకే వస్తున్న కారు సైతం ఆగిపోయింది. అదే సమయంలో కారు వెనుక నుంచి కేవీఆర్ ట్రావెల్స్ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో కారు రెండు ట్రావెల్స్ బస్సుల మధ్యలో నలిగిపోయి నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏపీలోని కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన గొర్రె జోష్‌కుమార్, చల్ల శ్రీహర్షకు తీవ్రగాయాలవ్వగా.. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. అతివేగంగా బస్సు నడిపి ప్రమాదానికి కారణమైన కేవీఆర్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ జోవన్నపూడి విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హర్షవర్ధన్ అంత్యక్రియలు పూర్తి



చౌటుప్పల్: హర్షవర్ధన్ అంతిమయాత్రలో పాల్గొన్న కుటుంబ సభ్యులు, బంధువులు

చౌటుప్పల్: నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర్లబావి గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు నీటి సంపులో మునిగి మృతిచెందిన చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన పోలోజు హర్షవర్ధన్(17) అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం నిర్వహించారు. హిందూ సాంప్రదాయం ప్రకారం జిల్లేడు చెట్టుతో హర్షవర్ధన్‌కు వివాహం జరిపించి అంతిమయాత్ర నిర్వహించారు. హర్షవర్ధన్ భౌతికకాయానికి అతడి తాత నర్సింహాచారి తలకొరివి పెట్టారు. బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర మాజీ సభ్యుడు దోనూరు వీరారెడ్డి, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, వివిధ పార్టీల నాయకులు, ఆర్ఎస్ఎస్, యువజన సంఘాల ప్రతినిధులు, మృతుడి స్నేహితులు, తదితరులు నివాళులర్పించారు. మృతుడి తల్లిదండ్రులు శ్రీనివాసచారి-శ్రావణిలను ఓదార్చారు.

రిషిక్ నేత్రాలు లయన్స్ క్లబ్‌కు దానం

నార్కట్‌పల్లి: ఇదే ప్రమాదంలో మృతిచెందిన నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన నల్లగొండ రిషిక్(17) నేత్రాలను అతడి తల్లిదండ్రులు నాగరాజు, స్వాతి నార్కట్‌పల్లి లయన్స్ క్లబ్‌కు దానం చేశారు. అనంతరం నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పలువురు పాల్గొని నివాళులర్పించారు.

ఏదుళ్లగూడెంలో మద్యం అమ్మకాలపై నిషేధం

- తీర్మానం చేసిన గ్రామస్తులు

వలిగొండ : వలిగొండ మండల పరిధిలోని ఏదుళ్లగూడెం గ్రామంలో బెల్టుషాపుల్లో మద్యం విక్రయించొద్దని ఆదివారం గ్రామస్తులు తీర్మానం చేశారు. తీర్మానానికి వ్యతిరేకంగా ఎవరైనా మద్యం అమ్మితే రూ.లక్ష జరిమానా విధించి.. ఆ డబ్బును గ్రామ అభివృద్ధికి కేటాయిస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎవరైనా మద్యం అమ్మినట్లు సమాచారం ఇస్తే రూ.10వేల నజరానా అందిస్తామని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గూడూరు వెంకట్‌రెడ్డి, ఏనుగు సత్తిరెడ్డి, ఏనుగు వెంకట్‌రెడ్డి, గూడూరు నర్సిరెడ్డి, ఏనుగు యాదిరెడ్డి, కప్పల భిక్షపతి, కుకుంట్ల కిష్టయ్య, నోముల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూసీకి పోటెత్తిన వరద



జూలూరు, రుద్రవెల్లి గ్రామాల మధ్యన లోలెవల్ బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న మూసీ

భూదాన్‌పోచంపల్లి: హైదరాబాద్‌లో కురుస్తున్న వర్షాలకు వరద మూసీ నదిలోకి వచ్చి చేరుతుండటంతో ఆదివారం తెల్లవారుజామున నుంచి మళ్లీ వరద పోటెత్తింది. దీంతో భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు, రుద్రవెల్లి గ్రామాల మధ్యన లోలెవల్ బ్రిడ్జి పైనుంచి మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఈ మార్గం గుండా పోచంపల్లి నుంచి బీబీనగర్‌కు రాకపోకలను నిలిపివేశారు. భువనగిరి నుంచి పోచంపల్లికి వచ్చే ఆర్టీసీ బస్సు సర్వీసులను కూడా రద్దు చేశారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బాలుడిని కాపాడబోయి మహిళ మృతి

రామగిరి(నల్లగొండ): కాలువలో పడిన బాలుడిని కాపాడబోయి మహిళ మృతిచెందింది. ఈ ఘటన ఆదివారం నల్లగొండ మండలం కొత్తపల్లి గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని కతాల్‌గూడకు చెందిన పగడాల అంజలి(28) బట్టలు ఉతికేందుకు కొత్తపల్లి గ్రామ శివారులోని ఎస్ఎల్‌బీసీ కాలువ వద్దకు వెళ్లింది. అదే సమయంలో ఈత కొట్టేందుకు కాలువ వద్దకు వచ్చిన జిల్లేపల్లి దీక్షిత్ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. అతడిని రక్షించేందుకు అంజలి నీటిలోకి వెళ్లింది. దీక్షిత్‌ను అక్కడే ఉన్న నారబోయిన రామకృష్ణ రక్షించగా.. అంజలి నీటిలో మునిగిపోయింది. సమీపంలోని బ్రిడ్జి వద్ద అంజలి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి భర్త కిరణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

రసాయన వ్యర్థాలు తిని గొర్రెలు మృతి

చిట్యాల: రసాయన వ్యర్థాలు తిని నాలుగు గొర్రెలు మృతి చెందగా, మరికొన్ని గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామ పరిధిలోని నార గుట్ట సమీపంలో గల భూముల్లో ఇటీవల కొందరు రసాయన వ్యర్థాలతో కూడిన సంచులను వదిలి వెళ్లారు. అదే గ్రామానికి చెందిన గొర్రెల పెంపకందారుడు మెట్టు లింగయ్యకు చెందిన మూడు గొర్రెలు ఆ రసాయన వ్యర్థాలను తిని శనివారం మృతి చెందగా.. ఆదివారం మరో గొర్రె మృతి చెందింది. మరికొన్ని గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. పశు వైద్యాధికారులకు సమాచారం ఇవ్వడంతో అస్వస్థతకు గురైన గొర్రెలకు చికిత్స చేశారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేసిన ఎంఎస్కే ప్రసాద్

- భారత క్రికెట్ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్కే ప్రసాద్

సూర్యాపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని భారత క్రికెట్ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్కే ప్రసాద్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎంఎస్కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో పది రోజుల పాటు నిర్వహించిన ఎంఎస్కే ఐసీఏ అండర్-16 క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి ఆదివారం రాత్రి ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కల్గుతాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో ఫ్రీడమ్ క్రికెట్ అకాడమీ, నల్లగొండ వారికి ప్రథమ బహుమతి లభించగా.. ఎంఎస్కే ప్రసాద్ క్రికెట్ అకాడమీ, సూర్యాపేట వారు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత నాగపురి రమేష్, నల్లగొండ జిల్లా సెక్రటరీ సయ్యద్ అమీబాబా, డాక్టర్ సందీప్, మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ భరత్, హెడ్ కోచ్ ఉస్మద్ తదితరులు పాల్గొన్నారు.

11న మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై రాత పరీక్ష

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణంలోని జలీల్‌పుర మసీదు వద్ద ఈ నెల 11న మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు మసీదు కమిటీ ప్రతినిధులు తెలిపారు. రాత పరీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం మసీదు కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ చౌదరి, సుజావుద్దీన్ మాట్లాడుతూ.. యువతకు మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై అవగాహన కల్పించేందుకు రాత పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్షలో పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలవారు ఈ నెల 10వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 11వ తేదీ ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు స్థానిక ఖదీమ్ జామియా ఇస్లామీయ అరబియా జలీల్‌పురాలో రాత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మొదటి బహుమతి పొందిన వారికి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలు అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9390993166, 9515932347, 9640093174, 9515585446 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ సలహాదారుడు అబ్దుల్ మతీన్, కమిటీ సభ్యులు మొహమ్మద్ ముస్తఫా, అబ్దుల్ ఖదీర్, నాసర్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో బతుకమ్మ, దసరా వేడుకలు

మోటకొండూర్: అమెరికాలోని మేరీల్యాండ్‌లో బతుకమ్మ, దసరా వేడుకలను ప్రవాస భారతీయులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి ఆడారు. అదే విధంగా అలాయ్ బలాయ్‌తో దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మోటకొండూర్ మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన పచ్చిమట్ల పాండుతో పాటు జీత్, ఫణీ జాలువంచ, ఉత్కల్, గోపి, ప్రసన్న, గోపి, ప్రసన్న, రోజారెడ్డి, జ్యోత్స్న, త్రివేణి, సంజయ్, స్వప్న ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



బతుకమ్మలను తీసుకొస్తున్న కాటేపల్లి గ్రామస్తులు

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

డిండి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం డిండి మండల కేంద్రంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండల కేంద్రానికి చెందిన అనిల్ బైక్‌పై తహసీల్దార్ కార్యాలయం వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఉన్న జంక్షన్ నుంచి డిండి మండల కేంద్రానికే చెందిన నరేష్ బైక్‌పై రోడ్డు క్రాస్ చేస్తుండగా.. అనిల్ బైక్‌తో ఢీకొట్టింది. దీంతో వారిద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నరేష్‌ను నల్లగొండకు, అనిల్‌ను నాగర్‌కర్నూల్‌కు తరలించారు.

మరమరాల ప్యాకెట్‌లో ఫంగస్



ఫంగస్‌తో కూడిన మరమరాలు

రాజాపేట: రాజాపేట మండల కేంద్రంలోని ఓ కిరాణ దుకాణంలో ఆదివారం ఓ వ్యక్తి మరమరాల ప్యాకెట్ కొనుగోలు చేశాడు. ప్యాకెట్ తెరిచిచూడగా అందులో ఫంగస్(బూజు)తో కూడిన మరమరాలు కనిపించాయి. ప్యాకెట్‌పై ట్రేడ్‌మార్క్ నంబర్‌తో పాటు 2025 ఆగస్టు 4న తయారు చేసినట్లు ఉంది. మార్కెట్లోకి వచ్చే ఇలాంటి ప్యాకెట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దృష్టిసారించాలని వినియోగదారులు కోరుతున్నారు.

చెరువుల్లో సందడి

రాజాపేట: ఇటీవల కురిసిన వర్షాలకు రాజాపేట మండలంలోని మల్లగూడెం, జాల, పాముకుంట, కుర్రారం గ్రామాల చెరువులు నిండి అలుగు పోస్తున్నాయి. వ్యాపార, ఉద్యోగ రీత్యా పట్టణాల్లో ఉంటున్నవారు దసరా పండుగకు స్వగ్రామాలకు వచ్చి ఆనందంగా గడిపారు. ఆదివారంతో సెలవులు ముగియడంతో తిరిగి పట్టణాలకు వెళ్లే క్రమంలో జాల, రాజాపేట, పాముకుంట గ్రామాల్లో అలుగు పోస్తున్న చెరువుల్లో తమ పిల్లలతో కలిసి సందడి చేశారు. మహిళలు, చిన్నారులు సెల్ఫీలు దిగుతూ చెరువు నీటిలో ఆనందంగా గడిపారు.



జాల గ్రామ పరిధిలోని చెరువులో ఫొటోలు, సెల్ఫీలు దిగుతున్న మహిళలు

